యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో లోన్ మేళా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ ఆల్కట్ గార్డెన్స్ వద్దనున్న యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి సంస్థలో శుక్రవారం లోన్‌మేళా నిర్వహించరాఉ. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సంస్థలో శిక్షణను పూర్తి చేసిన మహిళలకు పారిశ్రామికవేత్తలుగా చేయటానికి చేయూతనిచ్చే విధంగా లోన్ మేళాను ఏర్పాటు చేశామని సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. ఈతకోట బ్రాంచ్ మేనేజర్ గౌతం సహకారంతో లోన్ మేళాను ఏర్పాటు చేశామన్నారు. పదిమంది మహిళలకు రూ10వేల చొప్పున లోన్ మంజూరు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ఆరుగురిని సత్కరించామని తెలిపారు. రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆర్‌పిలతో వెట్టిచాకిరి

- పది రెట్లు పెరిగిన పనిభారం
- వేతనాల చెల్లింపుల్లోనూ నిర్లక్ష్యం
- ఆందోళనకు గురవుతున్న సిబ్బంది

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

మెప్మా విభాగంలో పట్టణాల్లో పనిచేస్తున్న ఆర్‌పిలతో రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోంది. పట్టణాల్లో నివసించే పేదలను డ్వాక్రా గ్రూపులుగా ఏర్పాటు చేసి, వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందించడంలో ఆర్‌పిలది కీలకపాత్ర. అలాంటి వారికి కనీస వేతనం ఇవ్వకుండా, ఎనిమిది గంటల పనివిధానం అము చేయకుండా ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సమస్యల పరిష్కారం కోసం ఆర్‌పిలు ఇప్పటికే రోడ్డెక్కారు. గత ప్రభుత్వంలోనూ వీరు నానా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంలోనైనా కష్టాలు తీరుతాయని భావించామని, వేతన కష్టాలకు తోడుగా పనిభారం వెంటాడుతోందని రాజమహేంద్రవరానికి చెందిన ఓ రిసోర్స్ పర్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా వేతనాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని వేడుకుంటున్నా పట్టించుకోవట్లేదని వాపోయారు.

జిల్లాలో సుమారు 300 మంది

పట్టణాల్లోని మెప్మా విభాగంలో, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో సుమారు 300 మంది రిసోర్స్‌పర్సన్లుగా పని చేస్తున్నారు. 2019లో వైసిపి అధికారంలోకొచ్చిన కొత్తలో యానిమేటర్లకు రూ.10 వేలు వేతనం ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఇంతవరకూ వారికి రూ.10 వేలు ఇచ్చిన దాఖలాలు లేవు. వైసిపి అధికారంలోకొచ్చి ఐదేళ్లవుతున్నా వేతన హామీ ఇంకా నీటిపై రాతగానే ఉంది. సాంకేతిక కారణాల సాకుతో ప్రతినెలా వేతన చెల్లింపులు ప్రక్రియకూడా పూర్తిస్థాయిలో అమలుకు నేచుకోవట్లేదు. కరోనా సమయంలో వ్యాక్సినేషన్‌కు ఆర్‌పిలు సేవలందించారు. వారికి కనీస గుర్తింపు లభించకపోగా వేతనాలు కూడా ఆగిపోయాయి. ప్రతి ఏటా ఆందోళనల నేపథ్యంలో మూడు నెలకోసారి లేదా ఐదు నెలలకు ఒకసారి వేతనాల చెల్లింపులు జరుగుతున్నాయి. నెలలు తరబడి వేతనాలు ఆగిపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

వెట్టిచాకిరీ.... వేధింపులు...

రిసోర్స్ పర్సన్లు, యానిమేటర్లపై రోజు రోజుకు పనిభారం పెరుగుతోంది. దీనికి తోడు అధికారుల వేధింపులు అధికం అవుతున్నాయి. డ్వాక్రా గ్రూపుల సమావేశాలు నిర్వహించి వారి అభివృద్ధికి తోడ్పడడం, గ్రూపులకు రుణాలు ఇప్పించడం, మొబైల్ బుక్ కీపింగ్, బ్యాంకు లింకేజీ ద్వారా ఉన్నతి, స్త్రీనిధి, ఆసరా వంటి పథకాలను మహిళలకు అందుబాటులోకి తేవడం వీరి ప్రధాన విధులు అని అధికారులు చెబుతున్నారు. అయితే తాజాగా ఒటిఎస్ వసూళ్లు, జగనన్నతోడు పథకానికి లబ్ధిదారుల ఎంపిక, రుణాలు ఇప్పించడం, బ్యాంకుల చుట్టూ తిరిగి టిడ్కో ఇళ్లకు రూ.35 వేల రుణాలు ఇప్పించడం, కొత్త గ్రూపులను ఏర్పాటు చేయించడం వంటి అదనపు పనులు కేటాయిస్తున్నారు. పట్టణాల్లో చెత్త సేకరణకు సైతం వినియోగించడంతో ఆవేదనకు గురవుతున్నారు. విధి నిర్వహణలో భాగంగా ప్రతిరోజు వర్క్ డన్ బాధ్యతను అప్పజెప్పారు. ఇతర పనులు అధికమవడం, మొబైల్ నెట్‌వర్క్, సాంకేతిక కారణాల నేపథ్యంలో అధిక శాతం మంది ఈ పని చేయలేక పోతున్నారు. వర్క్ డన్ చేయని కారణంగా వేతనాల్లో కోత విధిస్తున్నారు. వారికి రూ.5 వేల నుంచి రూ.6 వేల లోపు మాత్రమే చెల్లింపులు జరుగుతున్నాయి. అదేవిధంగా ప్రభుత్వాలు మారిన ప్రతిసారి రాజకీయ వేధింపులు పరిపాటిగా మారుతున్నాయి. 45 ఏళు దాటాయనే కారణంతో తొలగింపులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్‌పిలపై రాజకీయ వేధింపులు తగదు

పట్టణాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్న ఆర్‌పిలపై రాజకీయ వేధింపులు తగదు. ప్రభుత్వ, అధికార పార్టీ కార్యక్రమాలకు డ్వాక్రా గ్రూపు సభ్యులను తరలించాలని ఉన్నతాధికారులు ఆర్‌పిలకు లక్ష్యాలను విధిస్తున్నారు. ఇది సరైంది కాదు. అక్రమ తొలగింపులను విరమించు కోవాలి. ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా నెలకి రూ.10వేల వేతనం అమలు చేయాలి. కనీస వేతనం రూ.26వేలు చెల్లించేందుకు కషి చేయాలి. పని ఒత్తిడిని తగ్గించాలి. మూడేళ్ల కాలపరిమితి ఉత్తర్వులను రద్దు చేయాలి.

- బి.రాజులోవ, జిల్లా ప్రధాన కార్యర్శి, సిఐటియు

సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులో జైపూర్ సుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు కోరారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ చాగల్లులోని జైపూర్ షుగర్ ఫ్యాక్టరీకి ఎంతో చరిత్ర ఉందన్నారు. 1961లో సీజన్‌కు 850 టన్నుల క్రషింగ్ కెపాసిటీతో మొదలైందన్నారు. 2016 నాటికి 9,500 టన్నుల కెపాసిటీకి పెరిగిందన్నారు. 55 ఏళ్లపాటు పనిచేసిన ఈ సుగర్ ఫ్యాక్టరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు హయాంలో మూతపడిందన్నారు. చక్కెరకు గిట్టుబాటు ధరలేక, యాజమాన్యం వైఫల్యం వల్ల తెచ్చిన బ్యాంకు రుణాలు తీర్చక పోవడంతో ఫ్యాక్టరీని మూసేశారన్నారు. దీన్ని నమ్ముకుని 13 మండలాలకు చెందిన 20 లక్షల మంది వరకూ ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి పొందార న్నారు. ప్రస్తుతం వారంతా ఉపాధిని కోల్పోయారన్నారు. 2019లో తాను గెలిస్తే షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని తానేటి వనిత హామీ ఇచ్చారన్నారు. కాని అసెంబ్లీలో ఈ కర్మాగారం కోసం ఏనాడు ప్రస్తావించలేదన్నారు. చెరకు పంట లేకపోవడం వల్ల పంట మార్పిడి చేయకుండా రెండు సీజన్లలోనూ వరినే సాగుచేయాల్సి వస్తుంద న్నారు. ఫలితంగా భూసారం దెబ్బతింటుందన్నారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడాల్సి వస్తుందన్నారు. వర్షాకాలంలో పంట నీట మునిగి రైతులు నష్టాలబారిన పడి ఆత్మహత్యలు చేసుకుంటు న్నారు. అరటి తోటలు వేస్తుంటే తుపానులతో నష్టపోతు న్నారన్నారు. ఈ సమస్యలు దృష్టి పెట్టుకుని మంత్రులు తానేటి వనితి, చెల్లుబోయిన వేణు, ఎంపీ మార్గాని భరత్, ఎంఎల్‌ఎలు తలారి వెంకట్రావు, జి.శ్రీనివాస్ నాయుడు, జక్కంపూడి రాజా స్పందించి జైపూర్ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వ సహకారంతో తెరిపించాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘం మండల అధ్యక్షుడు కంకటాల బుద్ధుడు, రైతు సంఘం నాయకులు కొట్టారు నాగేశ్వరరావు, కొడవటి రాయుడు, మురళి ఉన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : బత్తుల

ప్రజాశక్తి - సీతానగరం

రానున్న ఎన్నికల్లో విజయం సాధించి రాజానగరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని టిడిపి, జనసేన కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వంగలపూడి రేవులో మృత్యుంజయ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఫ్లెక్సీల వివాదంపై జనసేన, టిడిపి శ్రేణులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాటవరంలో టిడిపి సీనియర్ నాయకులు చిట్టూరి రంగారావు ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయికలో పాల్గొన్నారు. టిడిపి నాయకులు నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తన గెలుపునకు సహకరించాలన్నారు. ఆయన వెంట టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల

చెళ్లపిళ్లకు ఘన నివాళి

ప్రజాశక్తి-కడియం

తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన అవధాన శూరులు తిరుపతి వేంకటకవులని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళాసేవా సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. జంట కవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి 74వ వర్ధంతిని ఆయన స్వగ్రామమైన కడియంలో శుక్రవారం నిర్వహించారు. ప్రప్రథమ ఆంధ్ర ఆస్థాన కవి, కళా ప్రపూర్ణ బిరుదాంకితుడు, పాండవ ఉద్యోగ విజయాలతో సహా అనేక నాటకాల రచయిత, కథా రచయిత, శతావధాని వాస్తు శిల్పి, వ్యాకరణ గ్రంథకర్త, చదరంగ పారాయణుడు బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన చెళ్లల్లపిళ్ల జన్మ దినోత్సవాన్ని ప్రభుత్వం తెలుగు అవగాహన దినోత్సవంగా గుర్తించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాది తోరాటి వసంతరావు, భగత్ సింగ్ సేవాసమితి అధ్యక్షులు తమ్మిశెట్టి ప్రసాద్, సీనియర్ రైతు నాయకులు చిక్కాల ఈశ్వరరావు తదితరులు మాట్లాడుతూ చెళ్లపిళ్ల సాహిత్యం నేటి తరానికి అందుబాటులో తీసుకురావాలని కోరారు. అనంతరం కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న జంట కవుల విగ్రహాలకి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. చెళ్లపిళ్ల కమిటీ సభ్యులు ఆకుల సూర్యనారాయణ, కొత్తూరి కష్ణ,డాక్టర్ గుర్రాల వెంకట్రావు, వేదాంతం రవి, యుటిఎఫ్ నాయకులు ఉంగరాల వీరభద్రరావు, కర్రి రాజు,ప్రముఖ నాటక కళాకారులు శీలం సుబ్బారావు, కొప్పిశెట్టి చంటి, బొర్రా రామకష్ణ, గారపాటి తాతబ్బాయి, బడిగంటి సూర్యనారాయణ, పున్నమిరాజు వీర్రాజు, వేదాంతం శ్రీనివాసనాని, హిందీ ప్రచార సమితి జిల్లా కో కన్వీనర్ చింతాడ హరి తదితరులు పాల్గొన్నారు.

6వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మహాశివరాత్రి సందర్భంగా పట్టిసీమ వెళ్లే యాత్రికులకు తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామంలో ఏటిగట్టు వద్ద గల భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద ఆలయ నిర్వహకులు శుక్రవారం 6వేల మందికి అన్నదానం చేశారు. ఉదయం సుమారు 4వేల మందికి అల్పాహారం అందించారు. సాయంత్రం 3వేల మందికి ఐస్‌క్రీమ్‌లు, చల్లని పానీయాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సొలస విశ్వనాథం, కార్యదర్శి సొలస గాంధీ మాట్లాడారు. గ్రామపెద్దలు, ప్రజల సహకారంతో 20 ఏళ్లుగా మహాశివరాత్రి రోజు ఈ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

నిరుపయోగంగా మినీ రైతు బజార్

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామంలో ఒళ్లుగుంట దుర్గమ్మ గుడి వద్ద గత టిడిపి ప్రభుత్వంలో కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ అనుబంధంగా చాగల్లు గ్రామంలో వ్యవసాయ మార్కెట్ మినీ రైతు బజార్‌ను రూ.15.43 లక్షలతో ఏర్పాటు చేశారు. 2015 డిసెంబరు ఆరో తేదీన అప్పటి మంత్రి నారా లోకేష్ దీన్ని ప్రారంభించారు. చేతుల మీదుగా ప్రారంభించారు. తర్వాత 2019 వైసిపి అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి ఇది మూతబడింది. దీంతో ప్రయివేటు వ్యాపారులు ఈ ప్రాంతంలో వ్యాపారం చేసుకుంటున్నారు. కనీసం దీన్ని అద్దెకు కూడా ఇవ్వకపోవడంతో ఎఎంసికి ఎలాంటి ఆదాయం కూడా రావట్లేదు.

అన్ని రంగాల్లోనూ రాణించాలి

మహిళా దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - యంత్రాంగం

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని, హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని మహిళా దినోత్సవ సభల్లో పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాలో పలుచోట్ల మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. **రాజమహేంద్రవరం రూరల్** కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టరేట్ సిబ్బంది ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత హాజరయ్యారు. కేక్‌ను కట్ చేసి పంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నేడు మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభను ప్రదర్శించి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఉద్యోగినులు ఉద్యోగ బాధ్యతలతో పాటు గృహిణిగా ఎంతో సమర్థవంతంగా ఇంటా బయటా తనదైన పాత్ర పోషించాల్సి ఉంటుందదన్నారు. ఆ క్రమంలో ఒత్తిడికి గురి అవ్వకుండా ఏ సమస్యనైనా ఎదుర్కొనేందుకు ఒక క్రమబద్ధమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ వేడుకల్లో డిఆర్‌ఒ జి.నర్సింహులు, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్, ఎఒ బివిఎస్.రామారావు, కలెక్టర్ సిసి వెంకటేష్, డిటి ఎం.సునీల్, సురేష్, నాయుడు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరంలో...

మహిళా కారాగారంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పరివర్తన గృహంలో జీవన శైలిని మార్చుకోవాలని సూచించారు. మహిళలందరూ ఉచిత న్యాయ సేవలు పొందేందుకు అర్హులని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి మాట్లాడుతూ మహిళలకు, పిల్లలకు, బడుగు బలహీన వర్గాలకు సంస్థ అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఐజి రవికిరణ్, ఒఎన్‌జిసి ఛీఫ్ జనరల్ మేనేజర్ మనీషశర్మ, జనరల్ మేనేజర్ సంగీత సాహు, మహిళా కారాగార

మహిళా కారాగారంలో...

సూపరింటెండెంట్ సిహెచ్.వసంత కుమారి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** ఎంపిడిఒ కార్యాలయంలో మహిళా ఎంపిటిసి సభ్యులను, మహిళా సర్పంచులను ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు సత్కరించారు. అలాగే వివిధ శాఖల్లో మహిళ అధికారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సావిత్రి, ఎంపిడిఒ నాతి బుజ్జి, ఎంపిపి మట్టా వీరస్వామి, వైస్ ఎంపిపి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. **సీతానగరం** మండలం కాటవరం సంజీవపురం ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీమణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జడ్‌పిటిసి సభ్యులు చల్లమళ్ల వెంకటలక్ష్మి హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళ పాత్ర వెలకట్టలేనిదన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీమణి మాట్లాడుతూ మహిళల కోసం

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో...

రూపొందించిన చట్టాలన్నీ సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. మహిళా వివక్షతను పారదోలడానికి కృషి చేయాలన్నారు. అనంతరం సర్పంచ్ సత్యవేణి, జడ్‌పిటిసి వెంకటలక్ష్మిలను సత్కరించారు. విజయలక్ష్మి, గీత, జగదీశ్వరి, నాగమణి, ఉషారాణి, యుటిఎఫ్ అధ్యక్షుడు జివఎల్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పాపారావు పాల్గొన్నారు. **కడియం** ప్రభుత్వాసుపత్రిలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివశంకర్ వైద్యులు డాక్టర్ మోహన వంశీ, డాక్టర్ అరుణ, సీనియర్ నర్స్ వలీమాలను ఘనంగా సత్కరించారు. వైద్య వృత్తిలో ఉన్న స్త్రీ మూర్తులందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షులు బళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి పి.దేవానందం, కోశాధికారి పి.చిన్ని, యు.ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు. **పెరవలిలో** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సాధారణ భీమా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. తణుకు పాతూరులోని బాలికల సంక్షేమ వసతిగృహానికి రూ.30 వేల విలువైన ఆర్ఒ వాటర్ ఫిల్టర్ సిస్టమ్‌ను అందించారు. పెన్షనర్ల అసోసియేషన్ మహిళా విభాగం నాయకులు పినిశెట్టి సత్యవతి, ప్రముఖ సామాజికవేత్త జి.ఆశాజ్యోతి ఆధ్వర్యంలో వార్డెన్ మేరీ కమల రత్నంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎఎస్‌వి.శేషుబాబు, టి.రాఘవేంద్రరావు, డి.సీతారామయ్య, నాళం దివ్య, హారిక, కనకదుర్గ, ఆకుల జ్యోతి పాల్గొన్నారు. **రాజానగరంలో** పిఒడబ్ల్యు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘం నాయకురాలు మరుకుర్తి వీరలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ న్యాయవాది, సంఘం జిల్లా నాయకురాలు కె.ప్రసన్న మాట్లాడారు. మహిళల హక్కులను కాలరాసే మనువాద సంస్కృతి తీసుకొచ్చేందుకు పాలకవర్గాలు కుట్రలు చేస్తున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. బ్రాహ్మణపల్లి భవాని, టి.గౌరి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

కిటకిటలాడిన శివాలయాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోనే శివాలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునుంచే యాత్రికుల రద్దీ మొదలైంది. **రాజమహేంద్రవరంలో** శుక్రవారం తెల్లవారు జామునుంచే ఘాట్‌లు అన్నీ యాత్రికులతో నిండిపోయాయి. పుష్కరఘాట్, సరస్వతీఘాట్, కోటిలింగాల ఘాట్‌లలో పలువురు గోదావరి స్నానాలు ఆచరించారు. పలు స్వచ్ఛంద సంస్థలు యాత్రికులకు ఫలహారాలు, శీతలపానియాలు, భోజనాలు ఏర్పాటు చేశారు. **కడియం** మండలం కడియపులంక హరిహర మహాక్షేత్రాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాష్ట్ర పచ్చదనం, బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. 60 వేల మంది తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. రాజమండ్రి సౌత్ జోన్ డిఎస్‌పి ఎం.అంబికా ప్రసాద్, కడియం సిఐ బి.తులసీధర్, ఎస్ఐ టి.కృష్ణసాయి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. **గోపాలపురం** మండలంలోని పలు ఆలయాల్లో అన్నదానాలు చేశారు. రాజంపాలెం సాయిబాబా సేవాశ్రమంలో సాయి కోటి మహోత్సవాన్ని నిర్వహించారు. 5వేల మందికి అన్నదానం చేశారు. సాగిపాడు శివారు బీమలింగేశ్వర స్వామి ఆలయం వద్ద 2వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పోసియ్య, దంగేటి వెంకట్రావు, చల్లా మంగారం, దొప్ప సాని అన్నవరం, చల్లా శ్రీనివాసరావు, చింతారావు, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు. **సీతానగరం** మండలంలో మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వంగలపూడి మునికూడలి, సీతానగరం గ్రామాల్లో వేకువ జామున నుంచి యాత్రికులు శివాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా సీతానగరంలో శివాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాళ్లపూడి శివాలయంలో క్యూలైన్లలో కిక్కిరిసిన యాత్రికులు

మహాశివరాత్రిలో ఫ్లెక్సీల వివాదం

వంగలపూడి రేవు నుంచి పట్టిసీమ వీరభద్రేశ్వర ఆలయానికి వెళ్లు మార్గంలో రేవు వద్ద టిడిపి, జనసేన పార్టీ నాయకుల ఫ్లెక్సీలు, జెండాలు కట్టారు. స్థానిక ఎంఎల్ఎ రాజా వాటిని తొలగించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ వెళ్లగానే అధికార పార్టీ నాయకులు ఫ్లెక్సీలు తొలగించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ఉద్రిక్తత నెలకొంది. ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఇరుపక్షాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

భూ హక్కు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి- పెరవలి

పెరవలి తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న దీపిక కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నవరత్నాలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్ల స్థలాలకు సంబంధించి భూ హక్కు పత్రాలను ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హత కలిగిన పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందించమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం కానూరు,నడుపల్లి, ఉసులుమర్రు, అన్నవరప్పడు, మల్లేశ్వరం, పిట్టలవేమవరం, ఖండవల్లి గ్రామాలకు చెందిన 1,056 మంది లబ్ధిదారులకు, సాయంత్రం కాకరపర్రు,పెరవలి, కొత్తపల్లి అగ్రహారం, ముక్కామల, కాపవరం, తీపర్రు, అజ్జరం, వెంకటరాయపురం గ్రామాలకు చెందిన 913 మంది లబ్ధిదారులకు భూహక్కు పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కార్చెర్ల సీతారాంప్రసాద్, వైసిపి మండల అధ్యక్షులు వీరమల్లు సత్యనారాయణ, జెఎసి నాయకులు రామడుగుల సూర్యనారాయణ వైస్ ఎంపిపి వేండ్ర శ్రీనివాస్, జడ్‌పిటిసి సభ్యులు కొమ్మిశెట్టి రామాంజని, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎ.స్వరూప రాణి, రాష్ట్ర డైరెక్టర్ దొడ్డిగర్ల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ నాయుడు

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-గండేపల్లి

మండలం ఎన్‌టి.రాజాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్‌ఐ బివివి.చంద్రశేఖర్ తెలిపారు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు, ఎన్‌టి.రాజాపురం గ్రామానికి చెందిన సవరపు ప్రకాష్ గత నెల 28న భార్యతో గొడవపడి తన ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. వారి కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల దగ్గరికి వెళ్లి వెతికినా కనిపించలేదు. దీంతో తల్లి సవరపు మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు చంద్రశేఖర్ తెలిపారు. ప్రకాష్ ఆచూకీ తెలిసినా వారు 9440904841 నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఎఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

సవరపు ప్రకాష్

పిడిఎస్ బియ్యం రవాణా చేస్తూ బోల్తా పడిన వ్యాన్

రోడ్డు ప్రమాదంతో..

పిడిఎస్ రైస్ రవాణా వెలుగులోకి

ప్రజాశక్తి గండేపల్లి

ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల బియ్యం దొడ్డి దారిన తరలిస్తున్న నేరగాళ్ల వైనం బయట పడింది. గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట గ్రామ శివారు వీరమ్మ పేరంటాల అమ్మవారి గుడి వద్ద పిడిఎస్ రైస్‌తో వెళ్తున్న వ్యాను ప్రమాదానికి గురి అయింది. విజయవాడ నుండి పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు వెళుతున్న వ్యాన్‌లో మూడు టన్నుల పిడిఎస్ రైస్ అక్రమంగా తరలిస్తున్న విషయం వెలుగు చూసింది. వ్యాను జాతీయ రహదారిపై వెళుతుండగా, అదుపుతప్పి డివైడర్ ఢీ కొట్టి రోడ్డుకు అవతల వైపు వెళు తున్న వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న నలుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డిఎస్‌ఒ ఎంవి.ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ నుంచి అక్రమంగా పిడిఎస్ రైస్‌ను పిఠాపురం మండలం భోగాపురం గ్రామానికి చెందిన వెలుగు వాసు అనే వ్యక్తి ఎటువంటి ఉత్తర్వులు లేకుండా విజయవాడలో సర్వో ఆగ్రో కంపెనీ నుంచి తరలిస్తున్నట్టు గుర్తించారు. రైస్ విలువ రూ.4.5 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ పిడిఎస్ రైస్‌ను మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకుని, జగ్గంపేట మండలం మల్లిసాకలోని స్టాక్ పాయింట్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సిఐ నాగరాజు, ఎంఎస్‌ఒ కృష్ణ, విఆర్‌ఒ దుర్గ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా కాలిబాట వంతెన

పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి-మండపేట

నిత్యం రద్దీగా ఉండే తాపేశ్వరం - పాలతోడు కాలిబాట వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో ఎప్పుడు ఏప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు, స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా తాపేశ్వరం నుంచి పాలతోడు వెళ్ళేందుకు ఇప్పనపాడు మెయిన్‌రోడ్డు మీదుగా వెళ్లడానికి ఒక మార్గం ఉండగా మరొకటి తాపేశ్వరం నుంచి వెలగతోడు మీదుగా వెనుకకు పాలతోడు రావల్సింది. అయితే తాపేశ్వరం-పాలతోడు రెండు గ్రామాల మధ్య ఉన్న పెద్ద మురుగు కాలువకు అప్పటి రాజ్యసభ సభ్యురాలు జయప్రద హయంలో ఎంపి నిధులతో రైతులు, కూలీలకు సౌకర్యంగా కాలిబాట వంతెనను నిర్మించారు. ఆవంతెనే ఇక్కడి ప్రజలకు, విద్యార్థులు ప్రధాన మార్గం అయ్యింది.

మెయిన్‌రోడ్డులలో ప్రయాణం దుమ్ము, ధూళి కావడంతోపాటు మరో ఐదు కిలోమీటర్లు అధికం కానున్న నేపథ్యంలో పచ్చని పంట పొలాల మధ్య ఉన్న ఈ కాలిబాట వంతెన మీదుగా పాలతోడు, పాలతోడు పాకలు, వెలగతోడు, మెర్నిపాడు మీదుగా రాజమహేంద్రవరానికి ప్రజలు వెళు తుంటారు. తాపేశ్వరంలోని ఉన్న ప్రభుత్వ ఉన్న త పాఠశాలకు పాలతోడు గ్రామానికి చెందిన సుమారు 20 మంది విద్యార్థులు వెళ్లి వస్తుంటారు. గత నెలల క్రితం పాలతోడు గ్రామ సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మీ అరవరాజు సొంత నిధులు సుమారుగా రూ.30వేలతో వంతెనకు మర్మమ్మతులు చేపట్టారు. అయితే ప్రస్తుతం మధ్యలో రెయిలింగ్ విరిగిపోతుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అయితే వర్షకాలంలో పరిస్థితి మరింత భయంగా భయంగా ఉంటుందని పలువురు చెబుతున్నారు. ఎటువంటి ప్రమాదాలు సంభవించముందే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

శిథిలావస్థలో ఉన్న వంతెన

బూత్ స్థాయి నుంచి వైసిపి బలోపేతం

ప్రజాశక్తి-జగ్గంపేట

బూత్ స్థాయి నుంచి వైసిపిని బలోపేతం చేయాలని, పార్టీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు తోట నరసింహం, చలమలశెట్టి సునీల్ గెలుపుకు కార్యకర్తలు సైనికులుగా చేయాలని పార్టీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురామ్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభ్యర్థుల గెలుపునకు కృషి చేసి మరొకసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. పేదలకు మేలు జరిగేలా చూడాలన్నారు. ఎంపిటిసిలు చెరుకూరి జయరాజు, గొల్లపల్లి శ్రీను, ఆకుల శ్రీధర్ మాట్లాడుతూ జగ్గంపేట వైసిపి కంచుకోట అని, అభ్యర్థి తోట నరసింహంను గెలిపించి హ్యాట్రిక్ సాధిస్తామన్నారు. ఎవరు ఎన్ని రకాల కుట్రలు చేసినా తోట నరసింహం గెలుపు ఎవరూ ఆపలేరన్నారు. మండల సేవాదళ్ కన్వీనర్ కిలపర్తి వీరబాబు మాట్లాడుతూ మంత్రిగా, పార్లమెంట్ సభ్యునిగా పని చేసిన అనుభవం గల నరసింహంను గెలిపిస్తే నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది అన్నారు. టౌన్ ప్రెసిడెంట్ కావవరపు ప్రసాద్, సచివాలయ కన్వీనర్ రెడ్డి భానుప్రతాప్, నీలపల్లి అప్పారావు, కోరాడ సుబ్బారావు, పచ్చిపులుసు వీరబాబు, బంటు బుజ్జిబాబు, దత్తి శ్రీనివాసు, సాకా రాజ్‌కుమార్, వేమగిరి రవి, మేడిశెట్టి బాలకృష్ణ, పైలా చైతన్య, కొల్లు యేసు, ఈగల శివ కాటన్, నక్కా వీరబ్రహ్మం, ఇసరపు లోవ, గొల్లపల్లి ప్రసాద్, ముక్కా నాగు, లావేటి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన 'కలలకు రెక్కలు'

ప్రజాశకి-సామర్లకోట

మహిళా సాధికారత దిశగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కలలకు రెక్కలు' అనే పేరుతో సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకొచ్చారనీ పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. శుక్రవారం అచ్చంపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏ ఆడబిడ్డ చదువుకు సంబంధించి డబ్బుల కొరతతో ఇంటికి పరిమితం కాకూడదనే ఆలోచనతో నూతన పథకాన్ని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. మహిళలకు వృత్తిపరమైన విద్యకు మార్గాలను అందించడంతో పాటు వారికి మరింత ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం అన్నారు. ఇంటర్మీడియట్ విజయవంతంగా పూర్తి చేసిన మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. ఈ పథకం కింద నమోదు చేసుకున్న మహిళలు తీసుకునే బ్యాంక్ లోన్‌కు తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది.ఈ పథకం కింద కోర్సుల కోసం మహిళలు తీసుకునే మొత్తం రుణానికి సంబంధించిన వడ్డీని కూడా టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఏ తెలుగింటి ఆడబిడ్డ కూడా నిధుల కొరత కారణంగా తమ కలలతో రాజీ పడాల్సిన అవసరం లేదు. ఈ పథకం కింద అర్హత ఉన్న మహిళలందరూ దేశంలో ఎక్కడైనా తమకు నచ్చిన ప్రొఫెషనల్ కోర్సులను అభ్యసించవచ్చున్నారు.

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి- పెద్దాపురం

స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక 19 వార్డు గౌరీ కోనేరు కాలనీలో పలువురు వైసిపిలో చేరారు. కాలనీకి చెందిన పేకేటి సతీష్, అరిగెల కృష్ణ, పులపర్తి బాలాజీ, సింధూరి వీరబాబు, తూతిక సంతోష్, తూరంగి సుబ్బారావు, కట్టమూరు నిత్యానంద స్వామి, దార్ల విశ్వనాధాచార్యులు, రొంగల నూకరాజు, సప్పవరపు సత్యనారాయణ, అడపా మహేష్, కోరెడ్డి శ్రీనివాస్ పార్టీలో చేరారు. వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సాయి ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు కట్టా రాజబాబు, త్సలికి సత్య భాస్కరరావు, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, తాడి రాజశేఖర్, రాఘవ, దేవరకొండ సూర్యనారాయణ, దాకమూరి రమేష్, తూతిక సత్యనారాయణ, కొండక సత్యనారాయణ, చింతా శ్రీనివాసరావు, మమ్మున ప్రకాష్, వీరేశ్వరపు ఏసుబాబు పాల్గొన్నారు.

పెద్దాపురంలో వైసిపిలో చేరిన నాయకులు

యానాం వార్తలు

క్యాండిల్ ర్యాలీ చేస్తున్న నాయకులు

పుదుచ్చేరి ఘటనలో నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి సోలైనగర్‌లో బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని యానాం యువత, సిఐటియు, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ పాత బస్టాండ్ వద్ద నిరసన తెలియజేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవివి.సత్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, దయ, మన్నే కిరణ్ తదితరులు మాట్లాడారు. మహిళలపై అత్యాచారాలను నివారించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని విమర్శించారు. మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాలు ఏరులై పారుతున్నాయన్నారు. ఇటువంటి సంఘటన మళ్లీ జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధాన రహదారుల్లో సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలని, బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాడి వెంకట్, లంక వినయ్ కొప్పిశెట్టి వాసు, సిఐటియు కన్వీనర్ సత్యనారాయణ, ఇళ్ల శ్రీనివాస్, జి.నాగేశ్వరావు, మహేష్, రమేష్, దిలీప్ పాల్గొన్నారు.



అతిథులను సత్కరిస్తున్న పాలిటెక్నిక్ స్టాఫ్

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాం లోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చంద్రసాగరన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలు చైతన్యవంతంగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు నిర్వహించే ఎన్ఎస్ఎస్ క్యాంపును ప్రారంభించారు. ఈ క్యాంపులో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సుధాకర్, ఆఫీసర్ జయవీరన్ పాల్గొన్నారు.

పత్రాలు అందిస్తున్న ఎంఎల్ఎ అశోక్

ఎస్‌సిలకు వ్యాపార రుణాల మంజూరు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఆది ద్రావిడ, షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా షెడ్యూల్డ్ కులాల వారికి జీవన ఉపాధి కల్పించాలానే సంకల్పంతో చిన్న వ్యాపారాలు పెట్టుకునేందుకు వ్యాపార రుణాలు మంజూరు చేసినట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో 15 మంది లబ్ధిదారులకు వ్యాపార రుణ పత్రాలు అందించారు. ఐదుగురికి ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున, మిగతా పదిమందికి రూ.50 వేల చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు.

మహిళల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి

ప్రజాశక్తి - యానాం

దేశంలో మహిళల అభ్యున్నతికి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కృషి చేశారని, మహిళల హక్కుల కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన మహనీయుడు అని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కొనియాడారు. శుక్రవారం పుదుచ్చేరి స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో ప్రపంచ మహిళ దినోత్సవ వేడుకలకు ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ రాజ్యాంగంలో ఎన్నో హక్కులు కల్పించారన్నారు. కానీ నేడు మహిళలకి ఎక్కడా రక్షణ లేకపోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. ఇటీవల పుదుచ్చేరిలో జరిగిన ఘటన తనను ఎంతగానో బాధించిందని ఆయన అన్నారు. నేటి సమాజంలో మహిళలు చైతన్యవంతంగా వ్యవహరించవలసిన అవసరం ఉందన్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్ చింతా మంగాయమ్మను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సన్మానించారు. ప్రాంతీయ పరిపాలన అధికారి ఆర్ మునిస్వామి, ఎస్‌పి రాజశేఖరన్, మున్సిపాలిటీ ఇన్‌ఛార్జి కమిషనర్ ఖండవల్లి రామకష్ణ, డాక్టర్ మీనాక్షి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రెయ్యా శ్రీనివాస్, ఎస్క్మి మురుగన్ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

జనంతో పోటెత్తిన శైవ క్షేత్రాలు

జిల్లాలోని శైవ క్షేత్రాలు శివరాత్రి సందర్భంగా యాత్రికులతో పోటెత్తాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట శ్రీకుమార రామ భీమేశ్వరాలయం యాత్రికుల తాకిడితో మార్మోగింది. శుక్రవారం లక్ష మంది పైగా తరలి రాగా ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. మహా శివరాత్రి సందర్భంగా వేకువజాము ఒంటి గంటకు అభిషేక పూజలను నిర్వహించారు. అప్పటికే క్యూలైన్లలో వేచి ఉన్న యాత్రికులు శివుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పుష్కరిణిలోనూ, ఆలయ ముఖద్వారమైన ఆర్చి వద్ద గల పవిత్ర గోదావరి కాలువలో, దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన జల్లు స్నానఘట్టం వద్ద అధిక సంఖ్యలో స్నానాలాచరించారు. ఆలయానికి చేరుకునేందుకు శాశ్వత వంతెనతో పాటు ఇనుప కాలిబాట వంతెనను ఏర్పాటు చేయగా రెండు వంతెనలను, మాండవ్య నారాయణ స్వామి ఆలయం వద్ద గల వంతెనను రాక పోకలకు ఉపయోగించు కున్నారు. ఆలయం వద్ద భక్తుల భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లను పెద్దాపురం డిఎస్‌పి లతా కుమారి, సామర్లకోట సిఐ సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

ప్రముఖుల పూజలు

భీమేశ్వరాలయంలో పలువురు ప్రముఖులు పుజలు చేపట్టారు. పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, వైసిపి పెద్దాపురం ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు, రాష్ట్ర కార్మిక శాఖ నాయకులు దవులూరి సుబ్బారావు, పెద్దాపురం ఆర్‌డిఒ జె.సీతారామారావు, పలువురు జడ్జిలు ఇతర ప్రముఖులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ నంది మండపంలో ఆశీర్వ దించారు.

యాత్రికుల సేవలో స్వచ్ఛంద సంస్థలు

భీమేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి సంద ర్భంగా శుక్రవారం వివిధ స్వచ్ఛంద సంస్థలు భక్తులకు విశేష సేవలు అందించారు. తెల్లవారు జాము నుంచే యాత్రికులు వేలాదిగా ఆలయానికి తరలి వచ్చారు. యాత్రికులు, చిన్న పిల్లలకు లయన్స్ క్లబ్, ఉప్పు వారి సత్రం, కొండపల్లి కృష్ణమూర్తి బ్రదర్స్, ఫ్రెండ్స్ ఫరెవర్, ఎస్‌బిఐ ఆధ్వర్యంలో పాలు, రొట్టెలు, మజ్జిగ, పులిహోర, అల్పాహారం, తాగునీరు, భోజనాలు అందజేశారు. ఇంకా మదుగులమ్మ ఆలయం ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం అందజేశారు. పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో యార్లగడ్డ వెంకట సుబ్బారావు మెమోరియల్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర పంపిణీ చేశారు.

రౌతులపూడి మండలంలోని శృంగవరంలో ఉన్న నందనవనంలో మహాశివరాత్రి సందర్భంగా యాత్రికులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున హాజరయ్యారు యాత్రికులకు నందనవనం కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. వందలాది మంది యాత్రికులు అన్నదానంలో పాల్గొన్నారు. గంగవరంలో భీమేశ్వరుని ఆలయానికి యాత్రికులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

తాళ్లరేవు శివనామస్మరణతో మండలంలోని శివాలయాలు మార్మోగాయి. పలు ఆలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు యాత్రికులు కిటకిటలాడారు.

పిఠాపురం దక్షిణ కాశీగా వీరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రానికి యాత్రికులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి పాదగయ పుష్కరిణిలో స్నానాలు చేసిన అనంతరం కుక్కుటేశ్వర స్వామివారిని రాజరాజేశ్వరి అమ్మవారిని, పురుహుతికా అమ్మవారిని, దత్తాత్రేయ స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన యాత్రికులకు సౌకర్యాలు కల్పించడంలో దేవాదాయ శాఖ అధికారులు విఫలమయ్యారు. దేవస్థానం వెనుకవైపున ఉన్న గేటు తాళాలు వేసి అధికారుల వద్దే ఉంచుకోవడంతో దేవస్థానం లోపలికి వచ్చే వివిధ శాఖ ఉన్నతాధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైద్య శిబిరం నిర్వహణకు వచ్చిన వైద్యులను కూడా లోపలికి అనుమతించకపోవడంతో వారు వెనుదిరిగారు. ఏర్పాట్ల నిర్వహణలో అధికారుల వైఫల్యంపై ఆలయ కమిటీ మాజీ చైర్మన్ టి.వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ బాలిపల్లి రాంబాబు, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం చైర్మన్ ఆర్.జనార్ధన్ రావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ దొరబాబు సమక్షంలో ఇఒ పి.నారాయణమూర్తిని నిలదీశారు.

పుతాపురం పాదగయలో యాత్రికుల సందోహం

కరప శివాలయాల్లో యాత్రికులు పోటెత్తారు. కరప రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఇఒ తిరుమల రవితేజ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఉప్పలంకలోని చొల్లంగి శివాలయంలో సముద్ర స్నానాలు చేశారు. కూరాడ, వేళంగి, నడకుదురు, అరట్లకట్ట గ్రామాల్లో శివరాత్రి పర్వదినం ఘనంగా నిర్వహించారు.

రామచంద్రపురం శివరాత్రిని పురస్కరించుకుని కోటిపల్లి ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం, ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయాలు యాత్రికులతో కిక్కిరిశాయి. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, వైసిపి ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాష్, రామచంద్రపురం ఆర్‌డిఒ సుధా సాగర్ పూజకార్యక్రమాల్లో పాల్గొన్నారు. డిఎస్‌పి బి.రామకృష్ణ ఆధ్వర్యంలో శాంతి భద్రతలు పర్యవేక్షించారు. ద్రాక్షారామంలో ఆలయ ఇఒ పి.తారకేశ్వరరావు, కోటిపల్లిలో ఆలయ ఇఒ శ్రీదేవి శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పర్య వేక్షించారు. **కపిలేశ్వరపురం** మండలంలో పలు గ్రామాల్లో ప్రధాన శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. **కొత్తపేట** మండలంలోగల శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. అధిక సంఖ్యలో యాత్రికులు ఆలయాలకు వెళ్లారు. **మామిడికుదురు** శివరాత్రి సంద్రర్భం గా పలు గ్రామాలలో శివరాత్రి ఉత్సవాలు భారీ సెట్టింగులతో నిర్వహించారు. **ఆలమూరు** శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. **కాట్రేనికోన** కుండలేశ్వరం పార్వతి కుండలేశ్వర స్వామిని మంత్రి పినిపే విశ్వరూప్ శుక్రవారం దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా, ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ కుటుంబ సమేతంగా, మాజీ ఎంఎల్ఏ దాట్ల బుచ్చిబాబు తదితరులు మగసాని తిప్ప కాలభైరవ స్వామిని దర్శించుకున్నారు. **ఆలమూరు** మండలం మడికి అభయ ఆంజనేయ స్వామి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్ కమిటీ చేస్తున్న అన్నదాన సేవలు అభినందనీయమని కొత్తపేట ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తదితరులు అన్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కెట్ ప్రాంగణంలో సుమారు 10 వేల మందికి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం గర్విం చదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్ పాలూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మండంలోని గొల్లవిల్లి భీమేశ్వర ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఉప్పలగుప్తంకు చెందిన వార్షిక అన్నదాత పోలిశెట్టి భాస్కరరావు తన తండ్రి వెంకటకృష్ణారావు జ్ఞాపకార్థం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. 51 సంవత్సరాలుగా భాస్క రరావు శివరాత్రి రోజున వేలాది మందికి అన్నదాన కార్య క్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. భాస్కరరావు చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అన్నదాన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

సామర్లకోటలో...

ద్రాక్షారామంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఇఒ

కోటిపల్లి ఛాయా సోమేశ్వర స్వామి వారి ఆలయం వద్ద యాత్రికుల రద్దీ

మహారాజశ్రీ పెద్దాపురం సివిలు జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు
E.A.No. 127 of 2018 in E.P.No.24 of 2018 in O.S.No. 94 of 2011

Between:
పరకాల శ్రీరామ్ ....డిక్రీ హెూల్డర్
And
1.పాము సుహాసిని
2.పాము చైతన్య దీపిక ...జడ్జిమెంట్ డెబిటర్స్
(2nd జడ్జిమెంట్ డెబిటర్ మైనర్ 1stజడ్జిమెంట్ డెబిటర్ తల్లి గార్డియను)

To,
1. పాము సుహాసిని W/o లేట్ దివాకర్, వయస్సు 32, చర్చి స్ట్రీట్, తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం J.C.J., ప.గో.జిల్లా,
2. పాము చైతన్య దీపిక D/o లేట్ దివాకర్, వయస్సు 32, చర్చి స్ట్రీట్, తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం J.C.J., ప.గో.జిల్లా,

పై నంబరు/పిటిషన్ నందు మీకు ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టున **ది:11-03-2024** తేదీన వాయిదా అయి వున్నది ఆ రోజున ఉదయం 10-30 గంటలనుండి మీరు స్వయంగా కానీ మీ న్యాయవాదితోగాని శ్రీ కోర్టు వారి ముందు హాజరు అయి మీ వాదనను తెలుపవలెను లేని యెడల మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్పు చెబుదురు.

శ్రీ కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారం
M.K. మొహియుద్దీన్,
అడ్వకేట్ పెద్దాపురం.

పెద్దాపురం,
27-02-2024.

IN THE COURT OF I ADDL. SENIOR CIVIL JUDGE: KAKINADA
I.P.NO.1 / 2024

Between:
Alugolu Srinivas, S/o. Venkatacharyulu, aged 45 years, R/o. Flat No.G-6, Block No.11, Rajeev Gruhakalpa Apartments, Dairy Farm Centre, Kakinada, Kakinada Urban Mandal, Kakinada District. ...Petitioner
And
Nallamilli Venkata Reddy & 2 others ...Respondents

To Respondents:
1) Nallamilli Venkata Reddy, S/o. Sura Reddy, aged 49 yrs., Cultivation, R/o. D.No. 16-16-A4, Seven Hills Road, Sambamurthy Nagar, Kakinada, Kakinada Urban Mandal, Kakinada District.
2) Banala Satyavathi, W/o. Narayana Murthy, aged 48 yrs., R/o. D.No.GF-6, Block No.11, Rajeev Gruhakalpa Apartments, Dairy Farm Centre, Kakinada, Kakinada Urban Mandal, Kakinada District.
3) Alugolu Veerababu, S/o. Soma Shakara Acharyulu, aged 48 yrs., R/o. D.No.16-42-43/3, Ayodhya Nagar, Road No.2, Kakinada, Kakinada Urban Mandal, Kakinada District.

పై నెంబరు పిటిషన్‌లో పిటిషనర్ తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ పై కోర్టువారి ఎదుట పిటిషన్ దాఖలు చేసి యున్నారు. కావున సదరు పిటిషన్‌లో చూపించిన రెస్పాండెంట్స్ మరియు ఇతర బాకీదారులు ఎవరైనా ఉన్నచో పై శ్రీ కోర్టువారి ఎదుట ది.**11-03-2024** తేదీన ఉదయం **10.30** ని॥లకు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియపరచుకొనవలెను.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

T.MUSALAYYA (Mukesh)
Advocate
Gandhi Nagar, Kakinada, Cell: 9951322826